# అద్దములో మనము

## క్రైస్తవుని ఆత్మ పరిశీలన



జేమ్సు జయశీలు చౌధరి

# అద్దములో మనము

(క్రైస్తవుని ఆత్మ పరిశీలన)

జేమ్సు జయశీలు చౌధరి

విజయనగరం

2018

వెల : రూ. 20-00

# అద్దములో మనము

## (క్రైస్తవుని ఆత్మ పరిశీలన)

ప్రథమ ముద్రణ - 2018

ప్రతులు - 1000

@ No Copyright reserved

*Written by*

**JAMESJAYASEELCHOUDHURY**

BapistChurchCompound

Jonnada,

VizianagaramDist.

Cell : 94406 47374

Copies Available

Blessing Books
Vijayawada

9948689253

Printed at

Dilip Printers
Vijayawada

94935 07891

# అద్దములో మనము

(క్రైస్తవుని ఆత్మ పరిశీలన)

ఎవడైనను వాక్యమును వినువాడైయుండి దానిప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు?। వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా. **యాకోబు 1:23-24**

ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. **హెబ్రీ 4:12.**

# పది ఆజ్ఞల అర్థము

నేను ఉన్నవాడను అను వాడనై యున్నానని యెహోవా మోషేతో చెప్పెను.

దేవుడు ఈ అజ్ఞలన్నియు వివరించి చెప్పెను.

I. **మొదటి ఆజ్ఞ :-**

1. నీ దేవుడనైన యెహోవాను నేనే, .... నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. **నిర్గమ 20:3**

**ప్రతిబింబము:-**

ప్రతి క్రైస్తవుడు ఈ విషయములో విశ్వాసముంచాడు. విభేదించడు.
నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు.
ఈ వాక్యమునకు సంబంధించిన మరికొన్ని వాక్యములు చదువవలెను.
ఇదిగో నేను నేనే దేవుడను
నేను తప్ప వేరొక దేవుడు లేదు. **ద్వితీయో 32:39**
కుమారుని ముద్దుపెట్టుకొనుడి; లేనియెడల ఆయన కోపించును
అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు
ఆయనను ఆశ్రయించువారందరు ధన్యులు. **కీర్తన 2:12**

మరియు చేతిసహాయము లేక తీయబడిన ఒక రాయి, యినుమును మట్టియు కలిసిన ఆ ప్రతిమ యొక్క పాదములమీద పడి దాని పాదములను తుత్తునియలుగా విరుగగొట్టినట్టు తమకు కనబడెను। అంతట ఇనుమును మట్టియు ఇత్తడియు వెండియు బంగారమును ఏకముగా దంచబడి కళ్లములోని చెత్తవలె కాగా వాటికి స్థలము ఎచ్చటను దొరకకుండ గాలి

వాటిని కొట్టుకొనిపోయెను; ప్రతిమను విరుగగొట్టిన ఆ రాయి సర్వభూతలమంత మహా పర్వతమాయెను.। **దానియేలు 2:34-35**

చేతి సహాయము లేక పర్వతమునుండి తియ్యబడిన ఆ రాయి యినుమును ఇత్తడిని మట్టిని వెండిని బంగారమును పగులగొట్టగా తమరు చూచితిరే; యిందువలన మహా దేవుడు ముందు జరుగబోవు సంగతి రాజునకు తెలియజేసియున్నాడు; కల నిశ్చయము, దాని భావము నమ్మదగినది అని దానియేలు రాజుతో చెప్పెను. **దానియేలు 2:45**

నీ పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయకుము. **కీర్తనలు 51:11**

రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచుచుండగ, ఆకాశ మేఘారూఢుండై మనుష్యకుమారునిపోలిన యొకడు వచ్చి, ఆ మహావృద్ధుడగువాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను.। సకల జనులును రాష్ట్రములును ఆ యా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది అదెన్నటికిని తొలగిపోదు. ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు. **దానియేలు 7:13-14**

ఏలయనగా మనకు శిశువు పుట్టెను
మనకు కుమారుడు అనుగ్రహింపబడెను
ఆయన భుజముమీద రాజ్యభారముండును
ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు
నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని
అతనికి పేరు పెట్టబడును. **యెషయా 9:6**

అప్పుడు దేవుడైన యెహోవా – ఇదిగో మంచి చెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో ఒకనివంటివాడాయెను. కాబట్టి అతడు ఒకవేళ తన చెయ్యి చాచి జీవ వృక్షఫలమును కూడ తీసికొని తిని నిరంతరము జీవించునేమో అని. **ఆది 3:22**

అప్పుడు యెహోవా – నా ఆత్మ నరులతో ఎల్లప్పుడు వాదించదు;

**ఆది 6:3**

కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాపిస్మ మిచ్చుచు। **మత్తయి 28:19**

**ప్రతిబింబము:–**

అందరము, క్రైస్తవులైన మనమందరము దీనిని విశ్వసించుచున్నాము. నేను తప్ప వేరొక దేవుడు నీకుండ కూడదు. తండ్రి అనగా దేవుడు మాత్రమే.

తండ్రిని వేడుకొనవలనంటే, తండ్రినిచేరుకోవలనంటే, కుమారుని ద్వారానే జరగాలి. మన జీవితములను తండ్రి,కుమార ఆజ్ఞల ద్వారా పరిశుద్ధాత్మ నడిపిస్తుంది.

--- కేధలిక్కులారా – ఈ లోకములో యేసు తల్లి మరియ దేవుని హస్తములతో చేయబడిన స్త్రీ మాత్రమే

--- మన జీవితములో దేవునికే ప్రధమ స్థానమివ్వాలి. వేరే దేనికైనా ప్రాధాన్యమిస్తే ఈ ఆజ్ఞను మనము ఉల్లంఘించినట్లే.

--- ఒకడు దేవునికి , సిరికిని దాసుడు కానేరడు. మరి ధనవంతులైన క్రైస్తవులారా మీ సంగతి ఏమిటి?

--- కడుపే వారి దేవుడు.

--- జీవపు డంబము - అధికారము, గర్వముతో కూడిన వారలారా మీ సంగతి ఏమిటి?

--- నీతిమంతులను జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వాదకరమే కాని వారికి సంఘములో ప్రాముఖ్యతను ఇచ్చువారలారా మీ సంగతి ఏమిటి? హెబ్రోను, బైబిలుమిషన్ వారు ఆలోచించాలి.

--- సంఘానికి శిరస్సు "యేసే". బిషప్‌లు, అధ్యక్షులు కారు. వీరు "తండ్రులు"గా పిలువబడుచున్నారు. కాని యేసుప్రభువు వారే స్పష్టముగా చెప్పినారుగదా, మీరు తండ్రీ అని ఎవరిని సంబోధింపవద్దు. పరలోకపు తండ్రిని మాత్రమే మీరు తండ్రీ అని పిలువవలెను. సి.ఎస్.ఐ, లూథరన్, మెథడిస్ట్, వారలారా ఆలోచించండి.

**II.రెండవ ఆజ్ఞ :-**

పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింద నీళ్ళయందేగాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికి సాగిలపడకూడదు వాటిని పూజింపకూడదు.

నిర్గమ 20:4

అంటే విగ్రహారాధన చేయకూడదు.

క్రింది వాటిని కూడా చదువవలెను.

వారి విగ్రహములు వెండి బంగారువి
అవి మనుష్యుల చేతిపనులు
వాటికి నోరుండియు పలుకవు
కన్నులుండియు చూడవు
చెవులుండియు వినవు
ముక్కులుండియు వాసనచూడవు
చేతులుండియు ముట్టుకొనవు
పాదములుండియు నడువవు
గొంతుకతో మాటలాడవు. **కీర్తన 115:4-8**

చెక్కడపు పనివాడు విగ్రహమును చెక్కుటవలన ప్రయోజనమేమి? పనివాడు మూగబొమ్మను చేసి తాను రూపించినదానియందు నమ్మిక యుంచుటవలన ప్రయోజనమేమి? అబద్ధములు బోధించు పోత విగ్రహములయందు నమ్మిక యుంచుటవలన ప్రయోజనమేమి?। కఱ్ఱనుచూచి - మేలుకొమ్మనియు, మూగరాతినిచూచి -లెమ్మనియు చెప్పువానికి శ్రమ; అది ఏమైన బోధింపగలదా? అది బంగారముతోను వెండితోను పూతపూయబడెను గాని దానిలో శ్వాసమెంత మాత్రమును లేదు.। అయితే యెహోవా తన పరిశుద్ధాలయములో ఉన్నాడు, ఆయన సన్నిధిని లోకమంతయు మౌనముగా ఉండునుగాక.

**హబక్కూకు 2:18-20**

ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును;లేదా యొకని పక్షముగానుండి యొకని తృణీకరించును. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు.

**మత్తయి 6:24**

నాశనమే వారి అంతము, వారి కడుపే వారి దేవుడు;వారు తాము సిగ్గుపడవలసిన సంగతులయందు అతిశయపడుచున్నారు, భూసంబంధమైనవాటియందే మనస్సు నుంచుచున్నారు. **ఫిలిప్పీ 3:19**

1కొరింథీ 8 అధ్యాయమునందు విగ్రహములకు బలిగా అర్పించినవాటి విషయము వ్రాయబడియున్నది. మొత్తము అధ్యాయము చదువుము.

**వివరణ:-**

విగ్రహములకు అర్పించినది- ప్రసాదముగా భావించి - దాని తినకూడదు. తెలిసి తినినయెడల అది పాపము. దేవుని ఉగ్రతకులోనైనది.

కావున భూమిమీదనున్న మీ అవయవములను అనగా జారత్వమును, అపవిత్రతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపివేయుడి.

**కొలొస్సీ 3:5**

**ప్రతిబింబము:-**

ప్రతిక్రైస్తవుడు బైబిలు జ్ఞానమున్నవాడు దీనినిమనస్పూర్తిగా అంగీకరిస్తాడు.

కేథలిక్కులు విగ్రహారాధీకులు. మరియ బొమ్మను, యేసుక్రీస్తు బొమ్మను పూజిస్తారు. మన దేశములో హిందూ దేవతలను కూడా పూజిస్తారు.

క్రొవ్వొత్తులు వెలిగిస్తారు. దూపమువేస్తారు. సెయింట్స్ చిత్రాలకు దైవత్వమును ఆపాదిస్తారు. ఇంట్లో యేసుప్రభువు చిత్రముంటే తప్పుకాదు. అది ఊహాచిత్రము మాత్రమే. ఇంట్లో యేసుప్రభువు, సిలువ చిత్రములు, మనము క్రైస్తవులమని తెలియజేయుటకు మాత్రమే. వాటిని పూజింపకూడదు. ఆలాగుననే అగౌరవపరచకూడదు.

మరి నీవు నేను అలాగునే ప్రవర్తించుచున్నామా? (వ్యక్తిపూజ:- భక్తసింగు, దేవదాసయ్య) భక్తులను జ్ఞాపకము చేసికొనుట ఆశీర్వదకరం.

ప్రసాదమని తెలిసి తినకూడదు. ఆలాగున చేస్తున్నామా?

ఇంకా ఈ క్రింద యివ్వబడిన విషయములన్నియూ విగ్రహారాధన అని బైబిలు చెప్పుచున్నది.

- ధనాపేక్ష
- గర్వము
- అధికార గర్వము
- పూర్వీకుల వైభవమునకు ప్రాముఖ్యతనిచ్చుట.
- లోకానందములో మునుగుట
- కులము యొక్క గొప్పతనమును, జాతి యొక్క గొప్పతనమును. గౌరవించుట / ప్రాముఖ్యమునిచ్చుట
- కుమారుని నామము ద్వారా కాకుండ వేరొకరి ద్వారా దేవుని వేడుకొనుట.

– హీరో వర్షిప్ – వ్యక్తి ఆరాధన

ఒకో మనిషికి ఒకే ఆత్మ ఉంటుంది. భక్తుల చరిత్ర దేవుని యెడల మన విశ్వాసము బలపడుటకు మాత్రమే.

III. **మూడవ ఆజ్ఞ –**

నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింపకూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరింపువానిని నిర్దోషిగా ఎంచడు. **నిర్గమ 20:7**

చదువవలసిన మరికొన్ని వాక్యములు.

నా నామమునుబట్టి అబద్ధప్రమాణము చేయకూడదు; నీ దేవుని నామమును అపవిత్రపరచకూడదు; నేను యెహోవాను. **లేవియ 19:12**

ఇదే సైన్యములకు అధిపతియగు యెహోవా వాక్కు – నేనే దాని బయలుదేరజేయుచున్నాను;అది దొంగల యిండ్లలోను, నా నామమునుబట్టి అబద్ధప్రమాణము చేయువారి యిండ్లలోను ప్రవేశించి వారి యిండ్లలో ఉండి వాటిని వాటి దూలములను రాళ్లను నాశనము చేయును.

**జెకర్యా 5:4**

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడునుగాక;

**మత్తయి 6:10**

వ్రాయబడిన ప్రకారము మిమ్మునుబట్టియేగదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది? **రోమా 2:24**

**ప్రతిబింబము:-**

– దేవుని నామము ఉచ్చరించినప్పుడు అది పెదవుల నుండి కాక, హృదయమునుండి భయము, భక్తితో ఉచ్చరించాలి. గుడ్‌మార్నింగ్, గుడ్‌ఈవినింగ్, గుడ్‌నైట్ నమస్కారము, వందనాలు అని ఇద్దరు కలిసినప్పుడు పరస్పరము విష్ చేసుకొన్నట్లుగానే ప్రెయిజ్ ది లార్డ్ అని అంటాము. ఫోనులో కూడ ఆలాగునే మాట్లాడతాము.

– ఓమైగాడ్, ఓ దేవా, జీసస్, గుడ్‌గాడ్ అన్నవి అలవాటుగా మాట్లాడుతాము.

– కొందరైతే దేవునితోడు అని అంటుంటారు.

– ప్రసంగీకుడు హల్లెలూయ (దేవునికి స్తోత్రం) అంటే వినేవారు కూడ హల్లెలూయ అని అంటారు.

అది అలవాటుగా మారినది. హృదయమునుండి భయభక్తులు ఉన్నప్పుడే దేవుని పేరు ఉచ్చరించాలి.

– నీకీ అలవాటుందా? అలాగైతే ఈ అలవాటు మానుకో

– దేవునితోడు అని సత్యము చెప్పినప్పుడే అది ఒప్పు కదా! లేకపోతే నాశనము కదా!

## IV. నాలుగవ ఆజ్ఞ :-

విశ్రాంతిదినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతిదినము. దానిలో నీవైనను నీ కుమారుడైనను నీ కుమార్తెయైనను నీ దాసుడైనను దాసియైనను ఏ

పనియు చేయకూడదు.। ఆరు దినములలో యెహోవా ఆకాశమును భూమియు సముద్రమును వాటిలోని సమస్తమును సృజించి, యేడవ దినమున విశ్రమించెను; అందుచేత యెహోవా విశ్రాంతిదినమును ఆశీర్వదించి దాని పరిశుద్ధపరచెను. నిర్గమ 20:8-11

పాతనిబంధన కాలములో ఇశ్రాయేలీయులు ఈజిప్టుదేశములో 400 సంవత్సరములు బానిసలుగా

ఉన్నారు. వారికి "యెహోవా" గురించి తెలుసును. కానీ వారి అలవాట్లు, జీవన విధానము ఐగుప్తు ప్రజల నాగరికత ప్రకారమే ప్రభావితమైనది.

దేవుడు వారిని, వారి బానిసత్వము నుండి విడిపించి వారిలో ఒక మంచి ప్రవర్తన కలిగించడానికి కొన్ని ఆజ్ఞలు, నిబంధనలు మోషే ద్వారా విధించాడు. ఈ ఆజ్ఞలు ఉల్లంఘించడమే పాపము. ఈ పాపానికి శిక్షలు,విధివిధానాలు ఏర్పర్చాడు.

అందులో ముఖ్యమైనవి పాప పరిహారార్థ బలులు, మరణశిక్ష, వెలివేత మొదలైనవి.

ఆరు రోజుల సృష్టి తర్వాత ఏడవ రోజు దేవుడు విశ్రాంతి తీసుకున్నాడని ఆదికాండములో చెప్పబడినది. దేవుడు విశ్రాంతి తీసుకుంటే ఏమౌతుంది? నిన్ను కాపాడువాడు కునుకడు, నిద్రపోడు, **కీర్తన 121:4**

ఇశ్రాయేలు ప్రజలు తమ జీవనాధారము కొరకు ఆరు రోజులు కష్టపడి ఒకరోజు విశ్రాంతి తీసుకొనుటకు దేవుడు చేసిన ఏర్పాటు.

ప్రతిబింబము :-

మరియు ఆయన విశ్రాంతిదినమున పంటచేలలోబడివెళ్లుచుండగా, శిష్యులు మార్గమున సాగిపోవుచు - వెన్నులు త్రుంచుచునుండిరి.। అందుకు పరిసయ్యులు - చూడుము, విశ్రాంతిదినమున చేయకూడనిది వారేల చేయుచున్నారని ఆయన నడిగిరి.। అందుకాయన వారితో ఇట్లనెను- తానును తనతోకూడ నున్నవారును ఆకలిగొని నందున దావీదునకు అవసరము వచ్చినప్పుడు అతడు చేసినది మీరెన్నడును చదువలేదా?। అబ్యాతారు ప్రధాన యాజకుడై యుండగా దేవమందిరములోనికి వెళ్లి, యాజకులే గాని యితరులు తినకూడని సముఖపు రొట్టెలు తాను తిని,తనతోకూడ ఉన్నవారికిచ్చెను గదా అని చెప్పెను. । మరియు- విశ్రాంతిదినము మనుష్యులకొరకే నియమింపబడెను గాని మనుష్యులు విశ్రాంతిదినముకొరకు నియమింపబడలేదు.। అందువలన మనుష్యకుమారుడు విశ్రాంతిదినమునకును ప్రభువై యున్నాడని వారితో చెప్పెను. **మార్కు 2:23-28**

కాబట్టి అన్నపానముల విషయములో అమావాస్య విశ్రాంతిదినము అనువాటి విషయములకు ప్రాముఖ్యతలేదు.

క్రొత్తనిబంధన యేసుప్రభువుసిలువపై చిందించిన రక్తమును బట్టి ఏర్పాటుచేయబడినది.ఆయనను విశ్వసించు "క్రైస్తవులు" పాపఫలమునుండి, మరణమునుండి విడుదలపొందియున్నారు. ఆయన ఆదివారమున పునరుత్థానుడై నందున మనకు "ఆదివారము" పరిశుద్ధ దినమైయున్నది. మనము శనివారము నెరవేర్చవలసిన జీవనవిధానమును ఆదివారమున

నెరవేర్చవలెను. అయితే క్రైస్తవుడా నీవు ఆదివారమునాడు ఏమి చేయుచున్నావు? ఆరాధనలో ఉత్సాహముగా పాల్గొనుచున్నావా? ఆ రోజు నీ ఆలోచనలు దేవునిపై లగ్నము చేయుచున్నావా? లేక లోకకాంక్షలు పై లగ్నముచేయుచున్నావా?

V. **అయిదవ ఆజ్ఞ :-**

నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని, నీ తల్లిని సన్మానించుము.

**నిర్గమ 20:12.**

ఈ క్రింది వాక్యమును బాగుగా చదువవలెను.

తన తండ్రినైనను తల్లినైనను కొట్టువాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును. **నిర్గమ 21:15**

ఎవడు తన తండ్రినైనను తన తల్లినైనను దూషించునో వానికి మరణశిక్ష విధింపవలెను. వాడు తన తండ్రినో తల్లినో దూషించెను గనుక తన శిక్షకు తానే కారకుడు. **లేవియ 20:9**

తండ్రికి కీడుచేసి తల్లిని తరిమివేయువాడు

అవమానమును అపకీర్తిని కలుగజేయువాడు. **సామెతలు 19:26**

నిన్ను కనిన నీ తండ్రి ఉపదేశము అంగీకరించుము

నీ తల్లి ముదిమియందు ఆమెను నిర్లక్ష్యము చేయకుము.

**సామెతలు 23:22**

తండ్రిని అపహసించి తల్లి మాట విననొల్లని వాని కన్ను
లోయకాకులు పీకును పక్షిరాజు పిల్లలు దానిని తినును.

**సామెతలు 30:17**

పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్టు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడవగుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది. **ఎఫెసీ 6:1-3**

**ప్రతిబింబము :-**

తలిదండ్రులను విడచి భార్యను హత్తుకొనుట దేవుని ఆజ్ఞయే. అలాగని తలిదండ్రుల విషయములో నీ బాధ్యతను నెరవేర్చాలని వాక్యము చెప్పుచున్నది. విస్మరించకూడదు..

తండ్రిని, తల్లిని సన్మానించడము అంటే వారిని ప్రేమిస్తూ, వారియెడల గౌరవముగాను, మర్యాదకరముగాను, వారికి కావలసిన సదుపాయములు కలిగించి వారి అవసరములు తీర్చడము. వారు క్షేమముగా ఉండునట్లు చేయడము. వారి మాటలు విని వారు చెప్పినట్లు చేయడము.

యేసుప్రభువు లోకరీతిగా తండ్రియైన యోసేపునకు, తల్లియైన మరియకు లోబడి యుండెను. సిలువపై నుండి కూడా తల్లియైన మరియ బాధ్యతను తన శిష్యుడైన యోహానుకు అప్పగించెను.

పది ఆజ్ఞలలో మొదటి నాలుగు చెప్పినదేమంటే దేవున్ని ప్రేమించి, గౌరవించడము, ఐదవది తలిదండ్రులను ప్రేమించి, గౌరవించడము మిగిలిన ఐదు ఆజ్ఞలు తోటి మానవులను ప్రేమించి, గౌరవించడము.

తలిదండ్రులనేకాక వారి తలిదండ్రులను (తాతలు, నాన్నమ్మలు, అమ్మమ్మలను, తలిదండ్రుల సహోదరీ సహోదరులను, అత్తమామలను, ప్రేమించి గౌరవించాలని అనేక బైబిలు వ్యాఖ్యనాలు చెప్పుచున్నవి. అంతేకాదు వయసులో పెద్దవారిని, సంఘకాపరిని, సంఘపెద్దలను, విద్యనొసగిన గురువులను, సమాజములోనున్న పెద్దలను, కూడా ప్రేమించి గౌరవించవలెను. ఈలాగున చేయుటవలన వారు మిమ్మల్ని ఆశీర్వదిస్తారు. ఆశీర్వాదము మేలు గదా?

మరి క్రైస్తవుడా! నీవేమి చేయుచున్నావు ఉద్యోగరీత్యా, సంపాదనరీత్యా, నీ తలిదండ్రులకు దూరముగా ఉన్నప్పుడు వారి యోగక్షేమములకొరకు నీవేమి చేయుచున్నావు.

VI. **ఆరవ ఆజ్ఞ :-**

నరహత్య చేయకూడదు. నిర్గమ 20:13

ఈ వాక్యములను కూడా జాగ్రత్తగా చదువుము.

నరహత్య చేయవద్దు; నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా. నేను మీతో చెప్పునదేమనగా – తన సహోదరునిమీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహీఅని చెప్పువాడు నరకాగ్నికి లోనగును.

**మత్తయి 5:21-22**

ఆలాగునే నిర్గమ 21: 12-31 వరకు చదివిన యెడల సహోదరుని యెడల మనము ప్రవర్తించవలసిన విధమును తెలుసుకొనవచ్చును.

**ప్రతిబింబము:-**

నరహత్య అనేక విధములుగా చేయవచ్చును.

1. ఒకడు హత్య చేయుబడుటకు సమ్మతించినయెడల (సౌలు స్తెఫను చావునకు సమ్మతించినట్లు)
2. ఒకని చావు అడ్డుకోకపోవుటద్వారా (పిలాతు యేసు మరణమును అడ్డుకొనలేకపోయిన రీతిని)
3. నిర్ధయగా ఉండుటద్వారా
4. చట్టమును సరిగా అమలుపరచకుండుటద్వారా
5. రక్తము కారేటట్లు గాయపర్చడము ద్వారా
6. అబద్ధసాక్ష్యముతో మరణశిక్షకు తోడ్పడుటద్వారా
7. గర్భస్రావము చేయుటద్వారా
8. పుట్టిన పిల్లలను చంపుటద్వారా
9. పగ, ద్వేషమును తీర్చుకొనుటద్వారా
10. నాలుకతో మానసిక హింస జరుపుటద్వారా
11. చేతలతో చంపుటద్వారా
12. ఆలోచనలద్వారా
13. రాతపూర్వకముగా
14. కుట్రద్వారా

15. విషముప్రయోగముద్వారా
16. చిల్లంగిద్వారా
17. ఉద్ధేశముద్వారా
18. లేనిపోనివి కల్పించి ఒకని యెడల దుష్ప్రచారము చేయుటద్వారా
19. తిట్టుటద్వారా - మూర్ఖుడా, వ్యర్థుడా, పనికిమాలినవాడా, చస్తే బాగుణ్ణు, చంపుతా.
20. ఆత్మహత్మ

మనమందరము ఏదో ఒక విధముగా నరహత్య చేయుచున్నాము.

VII. **ఏడవ ఆజ్ఞ** :-

వ్యభించరింపకూడదు. **నిర్గమ 20:14.**

వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా;। నేను మీతో చెప్పునదేమనగా - ఒక స్త్రీని మోహపుచూపుతో చూచు ప్రతివాడు అప్పుడే హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును।

**మత్తయి 5:27-28**

నేను మీతో చెప్పునదేమనగా - వ్యభిచారకారణమునుబట్టి గాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడినదానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు.

**మత్తయి 5:32**

మరియు లేవికాండమునందు 20వ అధ్యాయము 10 - 21 వరకు చదినయెడల వ్యభిచారమునుగూర్చి తెలియును.

అయినను నీమీద తప్పు ఒకటి మోపవలసియున్నది; ఏమనగా, తాను ప్రవక్త్రినని చెప్పుకొనుచున్న యెజెబెలను స్త్రీని నీవుండనిచ్చుచున్నావు. జారత్వము చేయుటకును, విగ్రహములకు బలియిచ్చిన వాటిని తినుటకునుఅది నా దాసులకు బోధించుచు వారిని మోసపరచుచున్నది.

**ప్రకటన 2:20**

అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి;జారులైనను విగ్రహారాధికులైనను వ్యభిచారులైనను ఆడంగితనముగలవారైనను పురుషసంయోగులైనను....

**1 కొరింధి 6:9**

జారత్వమునకు దూరముగా పారిపోవుడి. మనుష్యుడు చేయు ప్రతి పాపమును దేహమునకు వెలుపల ఉన్నది గాని జారత్వము చేయువాడు తన సొంత శరీరమునకు హానికరముగా పాపము చేయుచున్నాడు.

**1కొరింధి 6:18**

వేశ్యాసాంగత్యము చేయువానికి రొట్టెతునక మాత్రము మిగిలియుండును.

మగనాలు మిక్కిలి విలువగల ప్రాణమును వేటాడును.

**సామెతలు 6:26**

మరియు సామెతలు 5వ అధ్యాయమునుకూడ చదువవలెను.

**ప్రతిబింబము:-**

ఈ ఆజ్ఞను గురించి పాతనిబంధనలోను క్రొత్తనిబంధనలోను అనేక హెచ్చరికలున్నాయి. వ్యభిచారము శారీరకంగాను, మానసికంగాను చేయుచున్నారు.

1. శారీరకముగా :- పెండ్లికి మునుపు,-జార్వతము :- పెండ్లియైన తరువాత- వ్యభిచారము.
2. మానసికముగా :- జీవితంలో ఎప్పుడైనా - మానసిక వ్యభిచారం.
3. స్వలింగసంపర్కము.

విగ్రహారాధన కూడా వ్యభిచారము.

దీనిని ఉల్లంఘించకుండా ఒక్క వ్యక్తి కూడా ప్రపంచములో ఉండదు. అవకాశము దొరకనందునే పవిత్రముగా ఉంటారు.

దీనిని గురించి ప్రతి సాహిత్యములోను వ్రాశారు. "తలలు బోడులైన తలపులు బోడులౌనా? అన్నారు.

గే, లెస్బియన్ వివాహాలు చట్టబద్ధము చేస్తున్నారు. ఇందులో క్రైస్తవులు ముందున్నారు.

మనమెక్కడ ఉన్నాము? ఆజ్ఞ అనే అద్దంలో మన ప్రతిబింబము ఎలావుంది?

VIII. **ఎనిదవ ఆజ్ఞ** :-

దొంగిలకూడదు. నిర్గమ 20:15.

వేరే వ్యక్తికి చెందిన వస్తువును, వానికి తెలియకుండా తీసుకొనుట - దొంగిలించుట. దేవునికి ఇవ్వవలసినది ఇవ్వకపోవుట - దొంగిలించుట.

ఈ మందిరము పాడైయుండగా మీరు సరంబీవేసిన యిండ్లలో నివసించుటకు ఇది సమయమా? కాబట్టి సైన్యములకధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా - మీ ప్రవర్తననుగూర్చి ఆలోచించు కొనుడి. । మీరు విస్తారముగా విత్తినను మీకు కొంచెమే పండెను, మీరు

భోజనము చేయుచున్నను ఆకలి తీరకయున్నది, పానముచేయుచున్నను దాహము తీరకయున్నది, బట్టలు కప్పుకొనుచున్నను చలి ఆగకున్నది, పనివారు కష్టము చేసి జీతము సంపాదించికొనినను జీతము చినిగిపోయిన సంచిలో వేసినట్లుగా ఉన్నది. **హగ్గయి 1:4-6**

మానవుడు దేవుని యొద్ద దొంగిలునా? అయితే మీరు నాయొద్ద దొంగిలితిరి; దేనివిషయములో మేము నీయొద్ద దొంగిలితిమని మీరందురు. పదియవ భాగమును ప్రతిష్ఠితార్పణలను ఇయ్యక దొంగిలితిరి.। ఈ జనులందరును నాయొద్ద దొంగిలుచునేయున్నారు, మీరు శాపగ్రస్తులై యున్నారు. **మలాకీ 3:8-9**

**ప్రతిబింబము :-**

మందిరమునకు వచ్చిన కానుకలను సంఘకాపరి, మరియు సంఘనాయకులును, సంఘపెద్దలును వ్యర్థముగా ఖర్చుచేయరాదు. అట్లు చేసిన దేవుని సొమ్మును అపహరించి దొంగిలించినట్లే. అదే విధముగా విశ్వాసులు తమ సొంత సంఘమునకు కాక యితర సంఘములకు, యితర బోధకులకు తమ దశమభాగములను, కానుకలను యిచ్చుచున్నారు. ఇది కూడా దొంగిలించినట్లే.

IX. **తొమ్మిదవ ఆజ్ఞ :-**

నీ పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు. నిర్గమ 20:16.

ఈ క్రింది వాక్యములను జాగ్రత్తగా పరిశీలించుము.

అట్టివాడు నాలుకతో కొండెములాడడు, తన చెలికానికి కీడు చేయడు తన పొరుగువానిమీద నింద మోపడు. **కీర్తన 15:3**

మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు ఆదినుండి వాడు నరహంతకుడైయుండి సత్యమందు నిలిచినవాడు కాదు;వానియందు సత్యమేలేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు. **యోహాను 8:44**

**ప్రతిబింబము :-**

మన దైనందిన జీవితములో అబద్ధములు ఆడుచునే బ్రతుకు చున్నాము. ఇతరుల మీద కొండెములు, వారిని గురించి అనవసర అబద్ధములు చెప్పుచున్నాము. భార్య, భర్తతోను, భర్త భార్యతోను, పిల్లలు తలిదండ్రుతోను, తలిదండ్రులు పిల్లలతోను అబద్ధములు ఆడుచు నేయున్నారు. అవసరములోనున్న వారు అప్పుఅడుగగా చేతిలో చిల్లిగవ్వకూడా లేదు అని అబద్ధము అడుతూనేవుంటారు. ఏదైన సమస్య వచ్చినప్పుడు అబద్ధమాడి తప్పించుకొనుచున్నాము.

ఎవరికి హానిచేయని అబద్ధము లేక హానిచేయు అబద్ధములు అడుచునేయున్నాము. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఒకచోట ఉండి మరియొక చోట ఉన్నాను అని, ఐదు నిమిషాలలో వస్తున్నాను వేచివుండుమని పలికి గంటవరకు రాకపోవుట. మరియు మద్యము త్రాగి త్రాగలేదు అని చెప్పుట. అక్రమసంబంధమువుండి లేదని అబద్ధము చెప్పుట, ఈలాటివి అబద్ధములు. అబద్ధమునకు అంతులేదు. బాల్యమునుండే అబద్ధములాడి తప్పిపోవుచున్నాము.

X. **పదియవ ఆజ్ఞ :-**

నీ పొరుగువాని యిల్లు ఆశింపకూడదు.

నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు అని చెప్పెను. నిర్గమ **20:17**

**ప్రతిబింబము :-**

- పొరుగువానికున్నది ఆశించుట
- పొరుగువానికున్నలాంటివి ఆశించుట
- పొరుగువాని భార్యను ఆకర్షించుట -ఆమెతో అక్రమసంబంధము జరుపుట
- పొరుగువాని వస్తువులు పొందుటకు మాటువేయుట, దొంగిలించుట
- పొరుగువానికి హాని తలపెట్టుట
- పొరుగువారి ఆస్తి ఆక్రమించుట
- పొరుగువాని పశువులను బలవంతముగా తీసుకొనుట
- పొరుగువాని అభివృద్ధి సహించలేకపోవుట
- ఇవేమైన చేయుటకు ప్రయత్నించుచున్నావా?

పొరుగువాడు అంటే ఇరుగుపొరుగువాడేకాదు, నీకు తెలిసిన లేక తెలియనివాడైన కావచ్చు. నీకు స్నేహితుడైన నీకు శత్రువైన కావచ్చు. నీకు అయినవాడైన నీకు కానివాడైన కావచ్చును.

## యేసుప్రభువు కొండమీద ప్రసంగము -అధ్యం

I నా నిమత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు.। సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును.

**మత్తయి 5:11-12**

**ప్రతిబింబము :-**

- క్రైస్తవుడు మతానుసారము హింసింపబడితే ప్రతిఘటించకూడదు.
- హింస అనివార్యమైనప్పుడు తప్పించుకొని పారిపోవలెను
- దేశ న్యాయప్రకారము నడుచుకొనవలెను
- అధికార వ్యవస్థ సహకరించనప్పుడు అన్యాయమును భరించవలెను.

II మీరు లోకమునకు ఉప్పయి యున్నారు................................ మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి.

**మత్తయి 5:13-16**

**ప్రతిబింబము :-**

- కీర్తనలు 1వ అధ్యాయమును ధ్యానించుము.
- కీర్తనలు 15వ అధ్యాయమును ధ్యానించుము.

అలాగున ప్రతి క్రైస్తవుడు నడుచుకొనుచున్నాడా? మనమేమి చేయుచున్నాము.

III. శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కానియెడల మీరు పరలోకరాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను. **మత్తయి 5:20**

**ప్రతిబింబము :-**

శాస్త్రులు, పరిసయ్యులు మోషే ధర్మశాస్త్రప్రకారము మనుష్యులకు కనబడవలెనని నటించేవారు. కాని వారి హృదయములు కఠినమైనవి. దీర్ఘముగా ప్రార్ధనచేయుదురు. అయితే వారు వేషదారులు.వారిలాగే క్రైస్తవులు నడుచుకొనినయెడల ఏమి ప్రయోజనము?బైబిలు వాక్యప్రకారము క్రైస్తవులు నడుచుకొనవలెను.

IV. నీ కుడికన్ను నిన్ను అభ్యంతర పరచినయెడల................ నీ కుడిచెయ్యి నిన్నభ్యంతర ................ నీ దేహమంతయు నరకములో పడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనము గదా. **మత్తయి 5:29-30**

**ప్రతిబింబము :-**

అనుకోకుండా ఒక తప్పుచేస్తే అది తప్పని తెలిసిన యెడల పశ్చాత్తాపపడి అలాంటి తప్పు మళ్లీ చెయ్యకూడదు.

V. మీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అని యుండవలెను; వీటికి మించునది దుష్టునినుండి పుట్టునది. **మత్తయి 5: 37**

**ప్రతిబింబము :-**

క్రైస్తవుడు మోసపుమాటలు పలుక కూడదు. వుత్తిత్తి వాగ్ధానములు చేయకూడదు.ఒక పనిచేస్తానంటే అది ఎంత కష్టమైననూ చేయవలసినదే. ఒక చెడుపనిని చేయను అనిచెప్పి అదేపనిని రాజీపడి చేయుటకు సిద్ధపడకూడదు. తెలిసిన నిజాన్ని ఖచ్చితముగా చెప్పవలెను.

VI. కంటికి కన్ను,పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా.। నేను మీతో చెప్పునదేమనగా దుష్టునిఎదిరింపక, నిన్ను కుడిచెంపమీద కొట్టువాని వైపునకు ఎడమచెంపకూడ త్రిప్పుము.ఎవడైన నీమీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసికొనగోరిన యెడల వానికి నీ పైవస్త్రము కూడ ఇచ్చివేయుము. **మత్తయి 5:38-39**

**ప్రతిబింబము :-**

యిది భౌతికపరమైన విషయముకాదు. యిది ఆత్మీయ సంబంధమైనది మంచిని ఎదిరించేవాడిని మళ్లీ మళ్లీ ఎదిరించే అవకాశము యివ్వవలెను. దానివల్ల జరిగే దుష్ఫలితము ఏలాంటిదో చుట్టూ వున్న ప్రజలకు తెలుస్తుంది. ఒకడు మనకు అన్యాయము చేసినయెడల తిరిగి వాడికి అన్యాయము చేయకూడదు. ఒకడు తనను గాయపరచినయెడల తిరిగి వానిని గాయపరచకూడదు. ప్రభువు చెప్పిన ఈ మాటలు మన దైనందిన జీవితములో ఆచరించుట కష్టము.అయినను వాటిని ఆచరించి జీవించుటకు ప్రయత్నించవలెను.

VII. ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసినయెడల, వానితో కూడ రెండుమైళ్ళు వెళ్ళుము.। నిన్ను అడుగువానికిమ్ము, నిన్ను అప్పు అడుగ గోరువానినుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు.

**మత్తయి 5:41-42**

ప్రతిబింబము :-

ఎవరైన మీయొద్ద నుండి సహాయముపొందగోరిన యెడల వారికి మీ చేతనైనంత సహాయము చేయవలెను. వీలైతే కొంచెము ఎక్కువ చేయవలెను. అట్టి సహాయమువలన మేలుజరుగవలెను. నీ సహాయము సద్వినియోగము అయితే మంచిది. మీ సహాయము దుర్వినియోగమౌతుంది అని తెలిసినయెడల సహాయము చేయకూడదు. దీనిని అపాత్రదానము అంటారు. మద్యము,మత్తు పదార్ధములకొరకు, వేరే ఒకరికి హానిచేయుటకు నీవు సహాయపడకూడదు.

VIII. నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా;। నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారికొరకు ప్రార్ధనచేయుడి.

**మత్తయి 5:43-44**

ప్రతిబింబము :-

శత్రువువలన కీడు జరుగుతుంది. శత్రువును మనం ద్వేషిస్తాము. శత్రువు మీద పగతీర్చుకొనుటకు ప్రతికారము చేయుటకు తలపెడతాము. కాబట్టి శత్రువుని ప్రేమించుట చాలా కష్టమైనపని. దేవుని దృష్టిలో మానవులందరు సమానమే . నీకు ఒకడు శత్రువు అయితే నీవు ఇంకొరికి శత్రువుగా ఉన్నావేమో? ప్రభువు చెప్పిన విధముగా శత్రువుకి దుష్టనికి దూరముగా ఉండవలెను. శత్రువులో మార్పురావడానికి మన క్రియలద్వారా ప్రయత్నించాలి వీలైతే మేలు చేయాలి. ప్రార్ధనద్వారా దేవుని సహాయము కోరాలి.

IX. మనుష్యులకు కనబడలెనని వారియెదుట మీ నీతికార్యము చేయకుండ జాగ్రత్తపడుడి; లేనియెడల పరలోకమందున్న మీ తండ్రియొద్ద మీరు ఫలము పొందరు. కావున నీవు ధర్మము చేయునప్పుడు, మనుష్యులవలన ఘనత నొందవలెనని, వేషధారులు సమాజమందిరములలోను వీధులలోను చేయులాగున నీ ముందర బూర ఊదింపవద్దు; వారు తమ ఫలము పొందియున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. నీవైతే ధర్మము చేయునప్పుడు, నీ ధర్మము రహస్యముగానుండు నిమిత్తము నీకుడిచెయ్యి చేయునది నీ యెడమచేతికి తెలియక యుండవలెను. అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును. **మత్తయి 6:1-4**

**ప్రతిబింబము :-**

తక్కువచేసి ఎక్కువగా చేసినట్లు పదిమందిలో చెప్పుకొనుట మానవస్వభావము. ఇది ఎక్కువగా స్త్రీలలో కనబడుతుంది. కొన్ని సంస్థలు చందాలు సేకరించుటకు ఒక పుస్తకము తీసుకొని వస్తారు. మీరు యిచ్చిన దానికంటే ఎక్కువ యిచ్చినట్లు వ్రాయించుకుంటారు. దీనిలో వారి ఉద్దేశము ఫలనావారు యింత యిచ్చినారు కనుక మీరు యింతకంటే ఎక్కువ యివ్వగలరు. ఇది మోసము. క్రైస్తవుడు ప్రభువు మాటచొప్పున తాను చేసిన సహాయముగురించి బహిర్గతపరచకూడదు. ఆదివారము కొంతమంది ఎక్కువ కానుక ఇచ్చినప్పుడు పేరు వ్రాయిస్తారు. సంఘపెద్దలు కూడా ప్రోత్సహిస్తారు. ఇది ఆలోచించవలసిన విషయము.

X. మరియు మీరు ప్రార్ధనచేయునప్పుడు వేషదారులవలె ఉండవద్దు; ................ మీరు మీ తండ్రిని అడుగక మునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియును; **మత్తయి 6:5-8.**

**ప్రతిబింబము :-**

ఇక్కడ మనము పరిసయ్యుని ప్రార్ధన మరియు సుంకరి ప్రార్ధన జ్ఞాపకముచేసుకొనవలెను. పరిసయ్యుడు అందరు తన ప్రార్ధన వినవలెనని కోరుకుంటాడు. సుంకరి పశ్చాత్తాపడుచు ప్రార్ధనచేస్తాడు. ఒంటరిగా ఉన్నప్పుడు ప్రార్ధనచేయవలెను. పదిమందిలోనున్నప్పుడు హృదయములో ప్రార్ధనచేసుకొనవలెను.

XI. **పరలోక ప్రార్ధన:-** కాబట్టి మీరీలాగు ప్రార్ధనచేయుడి,। -పరలోక మందున్న మాతండ్రీ .............. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. **మత్తయి 6:9-13**

**ప్రతిబింబము:-**

ప్రభువునేర్పిన ప్రార్ధన సమగ్రమైనది. కొంతమంది క్రైస్తవులు యేసుప్రభువుచెప్పిన పరలోకరాజ్యము మీమధ్యనున్నది అను ఉపమానములను ఒక సిద్ధాంతముగాచేసి పరలోకరాజ్యము మనమధ్యనే ఉన్నదని భావించి ఈ ప్రార్ధనచేయకున్నారు. కాని వారొక మాట మరచిపోతున్నారు. సాతాను ఆధిపత్యము క్రిందనే ఈ లోకము ఇంకా వున్నది.

XIII. మనుష్యుల అపరాధములను .................మీరు మనుష్యుల అపరాధములను క్షమింపక పోయినయెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు. **మత్తయి 6:14-15.**

**ప్రతిబింబము :-**

క్షమించుట యేడుమారులేకాదు యేడుకు డెబ్బదిరెట్లు చేయవలెనని ప్రభువుచెప్పినారు. కాని మన స్వభావము ఒక్కసారి కూడా క్షమించుటకు సిద్ధముగా ఉండదు. కాబట్టి క్రైస్తవుడు ప్రతివారిని క్షమించే మనస్థత్వమును అలవరచుకొనవలెను.

XIII. మీరు ఉపవాసము చేయునప్పుడు ........................ ...... అప్పుడు రహస్యమందు చూచుచున్న నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును.

**మత్తయి 6:16-18**

**ప్రతిబింబము :-**

వాక్యము చాలా స్పష్టముగా ఉన్నది. ఉపవాసముచేయుచున్నట్లు యితరులకు తెలియకూడదు. యిది అభ్యాసమువలన చేకూరుతుంది. మీరు ఉపవాసము చేయుచున్నప్పుడు ఎవరైనను ఏమైన తినుటకుగాని, త్రాగుటకుగాని యిచ్చిన యెడల నేను ఉపవాసము చేయుచున్నాను అని గొప్పగా చెప్పుకొనకుండా వారిమనస్సును నొప్పించకుండ వాటిని తిస్కరించవలెను. అలాగుననే కొన్ని సంఘములో శుక్రవారమున
ఉపవాసప్రార్థన జరుగునని ప్రకటనచేయుట అసమంజసము.

XIV. భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు, ............ మీరు దేవునికి సిరికిని దాసులుగా నుండనేరరు. **మత్తయి 6:19-24**

**ప్రతిబింబము :-**

ఇక్కడ యేసుప్రభువు ధనవంతుని గురించి చెప్పిన ఉపమానమును గుర్తు చేసుకొనవలెను. తనకు కలిగిన సమృద్ధిని అనుభవించవలెనన్న ధనవంతుని కాంక్ష తీరకముందే తన ప్రాణమును కోల్పోవును. పరలోకరాజ్యములో మనము ధనము సమకూర్చుకొనవలెనంటే మనము బ్రతికుండగానే మనకు కలిగిన దానిని బీదలకు అవసరములో ఉన్నవారికి,అభాగ్యులకు యిచ్చివేయవలెను. మన కళ్ళయెదుట చాలా మంది విదేశాలలోనుండి ప్రభువుసేవ పేరిట పొందుచున్న ధనమును తమ విలాసవంతమైన సుఖజీవనముకొరకై వెచ్చించుచున్నారు. అలాగుననే పెద్ద పెద్ద సంఘములలో వచ్చుచున్న కానుకలను సంఘకాపరులు, సంఘపెద్దలు తమ వ్యక్తిగతమైన ఖర్చులకు వినియోగించుచున్నారు. ఉచితముగా పొందినది ఉచితముగా యివ్వవలెనని ప్రభువుచెప్పగా పేరుపొందిన బోధకులు ధనమును సమకూర్చుకొని విలాసవంతమైన జీవితమును గడుపుచున్నారు. అనగా వీరు సిరికి మాత్రమే దాసులు, కాని దేవునికి దాసులుకారు.

ప్రారంభములో తాముచేసిన సేవకు దేవుని ఆశీర్వాదమువలన ధనవంతులైనవారు దేవుని మరచిపోతున్నారు. అయితే వారు కాల్గేటు కంపెనీ వ్యవస్థాపకుని జీవితమును గురించి తెలుసుకొనవలెను. ఆయన, ఆయన వారసులు వారు పొందిన లాభము (ధనమును) తిరిగి సమాజసేవకొరకే వినియోగిస్తున్నారు.

XV. అందువలన నేను మీతో చెప్పునదేమనగా – ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో.......... ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. **మత్తయి 6:25-32.**

**ప్రతిబింబము :-**

యేసుప్రభువు ఈ విషయములను ప్రభువు సేవకు పూర్తిగా అంకితమైనవారిని గురించి చెప్పినవి. కాని సామాన్యమైన క్రైస్తవులకు దేవుడు జీవనోపాది ఏర్పాట్లు కలుగజేసినాడు. ఈ ఏర్పాటువలన సంపాందించిన ధనమును సవ్యముగా ఖర్చుచేయవలెను. కొంతధనమును రేపటికొరకు అనగా భవిష్యత్తుకొరకు పొదుపు చేసుకొనవలెను. అయినప్పటికీ కొన్ని అనివార్యపరిస్థితులలో మనకు అధిక ధనము కావలసియుండును అటువంటి పరిస్థితులలో దేవునిపై భారమువేసి ఆయనకు మొరపెట్టవలెను. విశ్వాసముతో వేడినయెడల మన అవసరములను దేవుడు తప్పక తీర్చుతాడు.

XVI. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును.। రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును; ఏనాటికీడు ఆనాటికి చాలును. **మత్తయి 6:33-34**

**ప్రతిబింబము :-**

దేవునిరాజ్యమనగా శాంతిసమాధానములు కలిగిన సంఘవ్యవస్థ. దేవుని నీతి అనగా దేవుని ఆజ్ఞలను పాటించుట. ప్రతి క్రైస్తవుడు వీటిని వెంటాడి ఆ విధముగా జీవించినయెడల దేవుడు మనకు ఏమికావలెనో

అవి మనకు దయచేయును. ఈ రోజు మనము అనుభవించిన కష్టనష్టములను మరచిపోయి మరుసటి దినము నిద్రలేచినప్పుడు దేవున్నిస్తుతించి, రోజంతయు క్షేమముగా ఉండుటకు వేడుకొని ముందుకుసాగవలెను.

XVII. మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మునుగూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్చుతీర్పు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచు కొలత చొప్పుననే మీకును కొలువబడును.

**మత్తయి 7:1-2**

**ప్రతిబింబము :-**

ఒక వ్యక్తి ఏ పరిస్థితులలో తప్పుచేసినాడో మనకు తెలియదు. సాదారణముగా న్యాయస్థానములు పరిస్థితులను పరిగణనలోనికి తీసుకొని నేరస్థుని శిక్షించును లేక వదిలివేయును. కాని మనము ఒక వ్యక్తిచేసిన తప్పును మనమనస్సుకు తోచినట్టుగా ఆలోచించి తప్పుచేసినాడని లేక తప్పుచేయలేదని నిర్ధారణచేస్తాము. అదే విషయమును మనచుట్టువున్న వారికి తెలియజేస్తాము. ఇదే విధముగా మనము తప్పుచేస్తే వేరేవారు మనయెడల ఆలాగునే చేస్తారు.కాబట్టి ఒకనియెడల మన ఆలోచన విధానములో జాగ్రత్త వహించవలెను. మనకు తెలియని విషయములో ఆలోచనద్వారా, మాటద్వారా, చేతద్వారా, జోక్యం చేసుకొనకూడదు.

XVIII. నీ కంటిలోనున్న దూలము నెంచక............. ..........నీకు తేటగా కనబడును. **మత్తయి 7:3-5**

**ప్రతిబింబము :-**

తప్పొప్పుల విషయములో అందరము వేషదారులమే. అనగా "నేను చెప్పినది చేయుము నేను చేసినది చేయకు" అని చెప్పడము. మనము చేసిన తప్పును ఎదుటవాడు చేస్తే మనతప్పును మరుగుపరచి ఎదుటవాడి తప్పును భూతద్దములో చూపుతాము. తప్పులెంచువాడు తనతప్పులెరుగడు. కాబట్టి ఎదుటవాడికి నీవు చేసేది తప్పు అని నిందించక అది సరిచేసుకో అని చెప్పడము మంచిది. నీవును నీ ప్రవర్తన సరిచేసుకో.

XIX. పరిశుద్ధమైనది కుక్కలకు పెట్టకుడి, మీ ముత్యములను పందులయెదుట వేయకుడి, వేసినయెడల అవి యొక వేళ వాటిని కాళ్ళతో త్రొక్కి మీమీద పడి మిమ్మును చీల్చివేయును. **మత్తయి 7:6.**

**ప్రతిబింబము:-**

దేవుని వాక్యము పరిశుద్ధమైనది. నీతులు అనగా మంచిమాటలు ముత్యములవంటివి. మనము ముఖ్యముగా బోధకులు ఈ విషయము మనస్సులో ఉంచుకొని బుద్ధిలేనివారికి, మూర్ఖులకు, అర్ధము కానివారికి, దుర్మార్గులకు మంచివిషయములు చెప్పకూడదు. కొన్నిసార్లు ఈలాంటి మాటలు మనము చెప్పినప్పుడు వారు మనలను నిందించవచ్చును, మరియు భౌతికముగా హాని తలపెట్టవచ్చును.

XX. అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును,। తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును. **మత్తయి 7:7-8**

ప్రతిబింబము:-

మన అవసరములనిమిత్తము మన విశ్వాసమునుబట్టి ప్రార్ధనచేస్తే దేవుని చిత్తమైతే దేవుడే ఎవరిద్వారానైనను ఇవి నెరవేరుస్తాడు. మనకు ఏమి కావలెనో అవి అనుగ్రహిస్తాడు.

XXI. మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు ................. కావున మనుష్యులు మీకు ఏమి చేయవలెనని మీరు కోరుదురో ఆటాగుననే మీరును వారికి చేయుడి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల ఉపదేశమునై యున్నది. **మత్తయి 7:9-12.**

ప్రతిబింబము :-

యేసుప్రభువు పది ఆజ్ఞలను రెండు ఆజ్ఞలుగా కుదించి చెప్పినారు. (మార్కు 12:30-32). రెండవ ఆజ్ఞ యొక్క సారాంశము దీనిలో కలదు. ప్రభువు తన శిష్యులతోకూడ ఈ మాటలనే - మీలో ఒకరినొకరు ప్రేమించుకొనుడి - అనిచెప్పినాడు.

XXII. ఇరుకు ద్వారమును ప్రవేశించుడి; నాశనమునకు పోవుద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునైయున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవుద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే. **మత్తయి 7:13-14.**

ప్రతిబింబము:-

పుట్టుకనుండి మనుష్యస్వభావము చాలా వింతగా ఉంటుంది. పిల్లలకు కట్టుబాట్లునచ్చవు. పెద్దలుకూడ విచ్చలవిడిగా ఉండుటకు ప్రయత్నిస్తారు. యువతీయువకులు కుటుంబకట్టుబాట్లలకు వ్యతిరేకముగా

ప్రవర్తిస్తారు. చెడును అనుసరించుటకు ఉత్సాహము చూపుతారు. ఆహారవిషయములో, వస్త్రధారణవిషయములో, అలంకరణవిషయములో, సమయపాలనలో క్రమశిక్షణ లేకుండా బ్రతుకుటకే యిష్టపడతారు. వీటివలన అనర్ధాలు జరుగుతాయని తెలుసు. దీనినే విశాలమార్గముగా చెప్పవచ్చును. క్రమశిక్షణ కలిగిన కట్టుబాట్లు ఇరుకుమార్గము. దేవుని వాక్యము దీనికి ప్రతీక. కాబట్టి చాలా కొద్దిమంది మాత్రమే ఇరుకు మార్గములో ప్రవేశించుటకు యిష్టపడుతారు.

XXIII. అబద్ధ ప్రవక్తలనుగూర్చి జాగ్రత్తపడుడి. వారు గొఱ్ఱెల చర్మములు వేసికొని మీయొద్దకు వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు .........కాబట్టి మీరు వారి ఫలములవలన వారిని తెలిసికొందురు.

**మత్తయి 7:15-20**

**ప్రతిబింబము:-**

నేటి సంఘ పరిస్థితికి ఈ మాటలు అద్దముపడుతున్నాయి. టీవి చానల్స్‌ద్వారాను, యూట్యూబ్ సందేశములద్వారాను మనము ఇటువంటి అనేక విషయములు చూస్తున్నాము. వాక్యప్రకారము కాకుండ కొందరు వ్యక్తులు సిద్ధాంతీకరించిన బోధలు విశ్వాసులను తప్పుడు మార్గములలో నడిపించుచున్నవి. సంఘములలోనున్న ప్రజాసామ్యవ్యవస్థ సాతాను చెప్పుచేతలలో వున్నది. దీనివలన క్రైస్తవుల విశ్వాసము సన్నగిల్లుచున్నది. అధునాతన నాగరికత ముసుగులో క్రైస్తవుల జీవనవిధానము వెర్రితలలు వేయుచున్నది. ఈలాంటి పరిస్థితినిగురించి ప్రభువుముందుగానే సంఘమును హెచ్చరించెను. కాబట్టి క్రైస్తవులమైన మనము ప్రతిరోజు బైబిలును పఠించి

ప్రార్థనద్వారా మన జీవనవిధానమును చక్కపరచుకొని క్రీస్తును మనలో ప్రతిఫలించునట్లుగా ముందుకు సాగవలెను.

XXIV. ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును......... .............. అక్రమము చేయువారలారా, నాయొద్దనుండి పొండని వారితో చెప్పుదును. **మత్తయి 7:21-23.**

**ప్రతిబింబము:-**

దేవుని ప్రేమించడమంటే దేవుని ఆజ్ఞలనుగైకొనడము దేవుని ఆజ్ఞలనుగైకొనుట. దేవుని చిత్తమును నెరవేర్చడము. ఈలాగు జీవించుట కొంతమందికి మాత్రమే సాధ్యము. క్రైస్తవులందరు దేవుని చిత్తప్రకారమే నడవాలని ప్రభువువారి ఉద్దేశము. (యోహాను 3:16). యేసు ప్రభువు మాటలద్వారా పరలోకరాజ్యమునుగురించి నరకమునుగురించి మనకు తెలియును. కొందరు పరలోకమునకు, మిగతావారు నరకమునకు వెళ్తారు. మనమైతే ఎక్కడికి వెళ్తాము?

XXV. ఇదిగో తోడేళ్ళమధ్యకు గొఱ్ఱెలను పంపినట్లు నేను మిమ్మును పంపుచున్నాను గనుక పాములవలె వివేకులును పావురములవలె నిష్కపటులునై యుండుడి............ వారు ఈ పట్టణములో మిమ్మును హింసించునప్పుడు మరియొక పట్టణమునకు పారిపోవుడి;

**మత్తయి 10:16-23.**

ప్రతిబింబము:-

సువార్తసేవకు తమజీవితమును సమర్పించుకొనిన బోధకులకు యేసుప్రభువు యిచ్చిన ఉపదేశము దీనిని వారు అర్థము చేసుకొని సువార్తను ప్రకటించవలెను. (మత్తయి 7:6).

XXVI. మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరుపెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు.। మరియు మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు.।

**మత్తయి 23:9-10.**

ప్రతిబింబము:-

నేటి సంఘములలో బిషప్‌లను, సంఘకాపరులను, తండ్రిగాను, గురువుగాను సంభోదించుచున్నారు. ఇది చాలా తప్పు. దేవుడే మనకు తండ్రి, యేసుప్రభువే మనకు గురువు. ఇది ప్రతి క్రైస్తవుడు గుర్తుంచుకొనవలెను.

XXVII. అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియనుగూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని, యే మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు. **మత్తయి 24:36**

ప్రతిబింబము:-

వాక్యము యింత స్పష్టముగానున్నను కొందరు బోధకులు కొన్ని సంఘములు, కొన్ని డినామినేషన్‌లు తమ ప్రసంగములుద్వారా, టీ.వి ద్వారాను, యూట్యూబ్‌లద్వారాను అత్యుత్సాహముగా తమ మూర్ఖత్వమును బయటపెడుతూ క్రైస్తవులను అనవసర భయాందోళనలకు గురిచేస్తూ వారిని

మానసికముగాను, ఆర్థికముగాను, దోపిడిచేయుచున్నారు. యేసుప్రభువు చెప్పిన విషయమును సరిగా అర్థముచేసుకొనరు. అర్థముచేసుకొననియ్యరు. కాబట్టి క్రైస్తవులారా బుద్ధిగల,బుద్ధిలేని కన్యకలగురించి యేసుప్రభువు చెప్పిన ఉపమానమును గుర్తుంచుకొని ప్రభువురాకకై కనిపెట్టుకొని జీవించండి. రెండవ రాకడ మనము బ్రతికుండగనే రావచ్చును! రాకపోవచ్చును!

XXVIII. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవి.

**2 యోహాను 2:16.**

**ప్రతిబింబము:-**

యేసుప్రభువు చెప్పినమాటలను యోహాను సూక్ష్మీకరించాడు. ప్రభువు ఏమిచేయవద్దన్నాడో మనము కొంచము విపులముగా తెలిసికొనగలము. శరీరాశ అనగా కామసంబంధమైన విషయములకు, దేహమునకు సుఖమిచ్చె పదార్థములు అనగా మద్యము, మత్తుపదార్థములు సేవించుట, మొదలగునవి విడిచిపెట్టవలెను. నేత్రాశ అనగా మోహసంబంధమైన విషయములు కంటికి కనిపించినవన్ని అవసరములేకపోయిన కోరుకొనడము, ఇతరులకు ఉన్నవికాబట్టి మనకు కూడ ఉండవలెనన్న మనస్తత్వము విడిచిపెట్టవలెను. జీవడంబము ఎక్కువుగా స్త్రీలలో కనిపిస్తుంది. ఆకర్షణీయముగా కనబడుటకు అలంకరణ, వస్త్రధారణ తాహతుకు మించిన వస్తుసేకరణ,లేనిదానిని ఉన్నట్టుగా చెప్పుకొనుట, ఇంట్లోనున్న వస్తువులను ప్రదర్శించవలెనన్న కోరిక స్త్రీలలో ఎక్కువగా

కనబడును. తక్కువస్థాయిని హెచ్చించిచెప్పుట స్త్రీలే ఎక్కువగా చేస్తారు. భర్త, పిల్లలు ప్రభావితులౌతారు. మగవారిలోఈ గుణముతక్కువైననూ కొన్ని విషయములో డంబముగా ప్రవర్తిస్తారు. దర్పముచూపిస్తారు. మేకపోతు గాంభీర్యము. ముఖ్యముగా నేటి బోధకులు, సంఘకాపరులు,సంఘపెద్దలు అర్హతలేకున్నా రెవరెండ్లు, డాక్టర్లు (రెవడాలు), బిషప్‌లు, ఆర్చిబిషప్‌లు, ప్రవక్తలు, అపోస్తులలు, ఆత్మజ్ఞాని, దైవజ్ఞాని, జయశాలి అనే బిరుదులు తగిలించుకొని మనముందరకు వస్తున్నారు. వీరిలో చాలామంది అబద్దబోధకులు, గర్వాంధులు అమాయకులైన విశ్వాసులను ప్రభావితులను చేసి వారిని దోచుకొనుచున్నారు. కావున బహుపరాక్. యేసుప్రభువు వెంటవున్న పన్నెండుమంది శిష్యులు అపోస్థలులు. ఇస్కరియోతు యూదా స్థానములో ప్రభువుని బాగా ఎరిగిన వ్యక్తియే అపోస్తులుడుగా ఎన్నుకొబడినాడు. ప్రభువు దర్శనము ద్వారా సౌలు, పౌలుగా మారి అపోస్తులైనాడు. అపోస్తులందరు హతసాక్షులు. నేడు మనమధ్యన అపోస్తలుగా కొందరిచే పరిగణింపబడినవారి జీవితములు ఏలావున్నవో ప్రతి క్రైస్తవుడు గమనించవలెను.

**యేసుప్రభువు చివరి ఆజ్ఞ :-**

కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొన వలెనని వారికి బోధించుడి.

**మత్తయి 28:19-20**

మరియు - మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. **మార్కు 16:15**

యేసుప్రభువు చివరి ఆజ్ఞను శిష్యులు యధాతథముగా శిరసావహించారు. క్రీస్తు ఆజ్ఞలను గైకొనువాడు నిజమైన క్రైస్తవుడు. ప్రభువు ఆజ్ఞలను గైకొననివాడు నామకార్థ క్రైస్తవుడు. నిజక్రైస్తవుడు అన్యజనులకు మాదిరిగా ఉంటూ తన క్రియలద్వారా మాటలద్వారా,చేతలద్వారా సువార్తను ప్రకటిస్తాడు. ప్రతిక్రైస్తవుడు సువార్తను అన్యులైనవారికి ఇరుగుపొరుగునున్న వారికి ప్రకటించవలెను. ప్రత్యక్షముగా సువార్త ప్రకటింపకపోయినను పరోక్షముగా సువార్తకు తోడ్పడవలెను. అనగా యింటింటి సువార్త సంస్థకు, బైబిలు సొసైటీ వారికి గిడియన్ సంస్థవారికి, అంకితభావముతో సువార్తను ప్రకటించుచున్న బోధకులకు ఆర్థికముగాను, పలుకబడిద్వారాను, వసతి కల్పించుటద్వారాను సహాయపడవలెను. టి.వీలలో ప్రసంగీకులు వారి బ్యాంక్ నంబర్లులను యిచ్చి, వారి వివరములను యిచ్చి సహాయముచేయమని అడుగుచున్నారు. అటువంటి వారి గురించి సరిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

స్నేహితులారా! ఈ చిన్నపుస్తకము వ్రాయుటకు నన్ను ప్రేరేపించిన విషయము గురించి మీకు చెప్పవలెను. ఆంధ్రజ్యోతి ఆదివారము అనుబంధములోని చిన్న కథ. ఒక ప్రార్థన మందిరమును మరమ్మత్తులు చేయుచున్న తాపీమేస్త్రికి ముగ్గురు "యాకోబుల"తో మంచి పరిచయము ఏర్పడింది. తాపీమేస్త్రి క్రైస్తవుడైనాడు. మరమ్మత్తు పనులు అయిపోయిన తరువాత మందిరములో ఆరాధన జరుగుచున్నది. తాపీమేస్త్రికూడా ఆరాధనలో పాల్గొనుటకు వెళ్ళాడు. తన స్నేహితులైన ముగ్గురు యాకోబులు మూడుచోట్ల వాళ్ళ కులాలవారిమధ్యన కూర్చుండుటచూచి హతాశుడయ్యాడు. తరువాత ప్రతి ఆదివారము తన యింట్లోనే ఆరాధన చేసుకొనేవాడు.

ఇంకా చాలా అద్దాలున్నాయి కానీ పది ఆజ్ఞలు, కొండమీద ప్రసంగము తీసుకొనడమైంది.

– జె.జె.చౌధరి

**ఆలోచించవలసిన కొన్ని విషయాలు.**

1. లూథరన్స్, సి.ఎస్.ఐ వారు విగ్రహారాధికులైన కేథలిక్ ఆరాధన పద్ధతులు అనుకరిస్తున్నారు. మార్టిన్ లూథర్ గారు తనకున్న పరిమితులలో పూర్తిగా రిఫార్మేషన్ చేయలేకపోయారు. ఇప్పుడున్న లూథరన్ చర్చి లీడర్స్ మంచి తియోలజికల్ విద్యనభ్యసించిన వారు కదా!ఎటువంటి ఆటంకము లేదుకదా! ఆరాధన పద్ధతులు సరియైన రీతిలో నిర్ణయించగలరుకదా!

2. పాపరహితుడైన యేసుప్రభువు తనకు 30 సం॥ ములు నిండాకనే బాప్తిసము తీసుకున్నారు. పుట్టుకతోనే పాపులము. చిన్నపిల్లలకు "చిలకరింపు" సబబా? మన దేశములో నీటికి కొరత వుందా? జ్ఞానము వచ్చాకనే కదా ప్రభువుని రక్షకునిగా అంగీకరింపగలము.

3. మెదక్ కెథడ్రెల్‌లో కొబ్బరి కాయలు కొట్టడము, జుత్తు తీయించడము సబబేనా?

4. దేవుని ఆత్మ యొక్కటే సర్వాంతర్యామి. మరణించాక నరుని ఆత్మ పరదైసునకుకానీ, నరకానికికానీ వెల్తుంది. దేవదాసయ్యగారి ఆత్మ ప్రతి చర్చిలోన సంచరిస్తుందా? హీరో వర్షిప్ విగ్రహారాధన కదా?

5. పేదలు డబ్బు వెచ్చించిలేరని, వారు నేలపై కూర్చొని ఆరాధించే ఏర్పాటు భక్తసింగు గారు చేశారు. వధూవరులను కూడా నేలపై కూర్చోబెట్టి పెండ్లి చేస్తున్నారు. అంత పేదరికము ఇప్పుడు లేదుకదా? ధనవంతులైన హెబ్రోను వారు చాలామంది వున్నారు. ఇంకా వారు

నేలపై కూర్చొనే ఆరాధించాలా?

6. సువార్త సభల్లో, ఉజ్జీవసభల్లో పెంతెకోస్తు ప్రసంగికులు ఎవరికీ అర్ధము కానీ భాషను వుపయోగించి సభను ప్రార్ధన ద్వారా ముగిస్తారు. ఆ భాష కొంతమందికైనా అర్ధము కావాలికదా? అబద్ధబోధకులు గురించి ప్రభువు హెచ్చరించాడుకదా?

7. పరిశుద్ధాత్మను అవమానినస్తే క్షమాపణ లేదని యేసుప్రభువు చెప్పారు కదా! మరి పెంతెకోస్తు వారు, మరి కొందరు బహిరంగ సభల్లో రంగస్థలములపై గట్టిగా కేకలేస్తు, డాన్సులు చేస్తూ పరిశుద్ధాత్మ దిగిరావాలని ప్రార్ధన చేస్తారు. కొందరైతే తలలపై చేతులు పెట్టి పరిశుద్ధాత్మ వారిపై దిగివచ్చినట్లు భ్రమింపచేస్తున్నారు. ఇది పరిశుద్ధాత్మను అవమానించడము కాదా?

8. పరిశుద్ధాత్మ మీపైకి వచ్చినప్పుడు మీరు శక్తి / ధైర్యము పొందెదరు. కానీ వెనక్కి నేలపై పడిపోరు. దెబ్బ తగలకుండా వెనుక ఇద్దరు నిల్చొని పట్టుకుంటున్నారు.

9. నిలువుటంగీలు ధరించి శాస్త్రులు, పరిసయ్యులు ప్రజలను మోసము చేయుచున్నారని యేసుప్రభువు గద్దించాడు. సంఘకాపర్లు, బిషప్‌లు నిలువుటంగీలు ధరిస్తున్నారు. వారి స్వభావము, ప్రవర్తన అంగీలు ధరించగానే మారిపోతున్నాయా? సద్బోధకులు అంగీలు ధరించకుండానే సువార్త ప్రకటిస్తున్నారు కదా!

10. ప్రభువు మరణించి, పునరుత్థానుడైనాడని విశ్వసించే వారు క్రైస్తవులు. ప్రభువు సంసార జీవితము గడిపాడని, ఆతని సంతతి

ఫ్రాన్సులోవున్నదని కొందరు మూర్ఖులు ప్రచారము చేస్తున్నారు. వారు క్రైస్తవులు కారు కదా? కానీ క్రైస్తవులుగా చలామణి అవుతున్నారు.

11. ప్రభువుని రక్షకునిగా అంగీకరించి, బాప్తిసము తీసుకొనేవారే ప్రభురాత్రి భోజనమునకు అర్హులు. మరికొంతమంది అబద్ధ బోధకులు బాప్తిసము తీసుకొనని వారికి కూడా ప్రభురాత్రి భోజనము ఇస్తున్నారు. అయోగ్యముగా ప్రభురాత్రి భోజనము తీసుకొనకూడదని వాక్యము చెప్పుచున్నది.

12. పాతనిబంధన పద్ధతులే ప్రాముఖ్యమని నమ్మేవారు (జెహోవా విట్‌నెస్, సెవంత్ డే అడ్వంటిస్టులు,) క్రైస్తవులుగా చెలామణి అవుతున్నారు. ప్రభువుని రక్షకునిగా అంగీకరించి, ఆయన మార్గము అనుసరించువాడు క్రైస్తవుడు. యేసుప్రభువు మనకిచ్చినది క్రొత్తనిబంధన.

13. ఆరాధన అంటే – దేవున్ని స్తుతించుట అనగా పాటలతోను, కీర్తనలతోను, సంగీతములతోను ఘనపరచుట. వాక్యము పఠించి ధ్యానించుట, ప్రార్థించి మొక్కిపెట్టుట. కానీ ఆరాధనలో కొన్ని అనవసరమైన పద్ధతులు ప్రవేశపెట్టి విశ్వాసులను తప్పుత్రోవ పట్టిస్తున్న డినామినేషన్లున్నాయి. జాగ్రత్త? కొందరైతే హిందూ ఆరాధన పద్ధతులు ప్రవేశపెడుతున్నారు.

14. ప్రపంచ జనాభా 730 కోట్లు. క్రైస్తవులు 200 కోట్లు. అందులో కేథలిక్కులు 120 కోట్లు. వీరు విగ్రహారాధికులు. ప్రొటెస్టంట్‌లు 80

కోట్లు. వీరికి 33 వేల డీనామినేషన్స్ ఉన్నాయి. మీరు ఒకరినొకరు ప్రేమించుకొనుడి అన్నది ప్రభువు ఆజ్ఞ. కానీ డినామినేషన్ల మధ్య ద్వేషములు, ఆవేశకావేషములు ప్రబలుతున్నాయి కదా?

15. స్వస్థత సభలలో ఎంతమంది స్వస్థత పొందుచున్నారు. సంఘకాపరి, సంఘపెద్దలు అనారోగ్యముగానున్న సంఘస్తుని యింటికి వెళ్లి నూనెరాచి ప్రార్థించాలని వాక్యము చెప్పుచున్నది. నూనె సీసాలను, నీటి సీసాలను అమ్మమని చెప్పుటలేదు. అన్యజనుల దేవుళ్ళ ప్రసాద రీతిని క్రైస్తవులు అనుసరించుట పాపము కదా?

16. ఇశ్రాయేలు, ఈజిప్టు, జోర్డాన్, పర్యటనలను తీర్థయాత్రలుగా కొందరు క్రైస్తవులు భావించుచున్నారు. పుణ్యక్షేత్ర దర్శనము ద్వారా రక్షణ కలుగదు. క్రీస్తుయందు విశ్వాసమే రక్షణ.

17. తమ మిడిమిడి జ్ఞానముతో బైబిలు చదివే క్రైస్తవులలో చాలామంది విమర్శకులున్నారు. దేవున్ని, యేసుక్రీస్తుప్రభువుని, విమర్శించేవారు శిక్షకు పాత్రులు సుమా!

18. బైబిలుని ఆదిమ హెబ్రీ, గ్రీకు భాషల నుండి ఇప్పటికి కొన్నిసార్లు తర్జుమా చేసి గందరగోళానికి గురి చేయుచున్నారు. వాక్యము సత్యమని నమ్మే క్రైస్తవులకు ఇది గొడ్డలిపెట్టు. తర్జుమా చేయుచున్న వారలారా మీరు దేవుని ఉగ్రతకు గురికాకండి.

19. "అందరు తలలు వంచండి ప్రార్థన చేదాము". ప్రస్తుత కాలములో పాస్టర్లు, బోధకులు అనడం సాదారణమైపోయినది. ప్రార్థన అనగానే క్రైస్తవులు తలలువంచుతారు. తలలువంచమని చెప్పడం చాలా ఎబ్బెట్టుగా ఉంటుంది.

20. "ఘనత మహిమ ప్రభావములు మీరే పొందుకొనుడి". యీ విధముగా కూడా చెప్పడం ఎబ్బెట్టుగా ఉంటుంది. "మహిమ ఘనత ప్రభావములు మీకే చెందునుగాక" అనడము సబబు.

21. చాలామంది బోధకులు గృహదర్శనము చేశాక, వెళ్ళెముందు ప్రార్థన చేస్తారు. అటుతరువాత ఆశీర్వాదము యిస్తూఉంటారు. యిది ఒక అలవాటుగా మారినది. ఆశీర్వాదించుటకు యోగ్యత చాలా ముఖ్యము.

22. లెంటు అనగా 40 రోజులు. శుభ శుక్రవారమునకు ముందుగా 40 రోజులు లెంటు పాటిస్తున్నారు. ఇది బైబిలులో లేదు. మొదటి రెండు శతాబ్ధలలోకూడా లేదు. మూడవ శతాబ్ధములో కెథలిక్‌లు ఈ పద్ధతిని ప్రవేశపెట్టినారు. గత రెండు శతాబ్ధాలుగా ప్రోటెంస్టులుకూడా అవలంభిస్తున్నారు. యేసుప్రభువు చనిపోవుట అనివార్యము. కావున లెంటు అవలంభించుట ఎంత వరకు సబబు?

ఈలాంటి విషయాలు ఇంకా చాలా ఆచరణలో కలవు.